# దీక్షిత
దిన పత్రిక

హైదరాబాద్
22-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 4
సంపుటి: 1
సంచిక: 64

ఎడిటర్ : సందీప్ వెల్లూరి   ప్రచురణ: హైదరాబాద్, రంగారెడ్డి , మెదక్


## మే 3 నుంచి గ్రూప్-1 మెయిన్స్



అమరావతి: గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ ప్రకటించింది. మే 3 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఏడు పేపర్లకు వరుసగా ఏడు రోజులు పరీక్షలు(డిస్క్రిప్టివ్) నిర్వహిస్తారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రశ్నాపత్రాలను ట్యాబ్స్ ద్వారా పంపిణీ చేయనున్నారు. 2023 డిసెంబర్‌లో 89 గ్రూప్%-%1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఒగతేడాది మార్చి 17న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి ఏప్రిల్‌లో ఫలితాలు వెల్లడించారు. ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున (1:50) 4,496 మంది మెయిన్స్‌కి ఎంపికయ్యారు. వీరికి మేలో విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రాల్లో మెయిన్ పరీక్షలు నిర్వహియిచనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి నరసింహమూర్తి తెలిపారు.



## గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోండి

**అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు**

**రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ**

**కలెక్టర్లతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇతర మంత్రుల వెల్లడి**

**ఈనెల 24 వరకు గ్రామ సభల నిర్వహణ**

హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా పలువురు మంత్రులు స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ పథకాలకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

2లో

## రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

స్కై రూట్ కో ఫౌండర్ పవన్ కుమార్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్

**ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ మూడు కీలక ఒప్పందాలు**

**'స్కై రూట్' పెట్టుబడులు 500 కోట్లు.. సీఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం**

**రాకెట్ తయారీ,ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత**

**రాష్ట్రంలో పెట్టుబడులకు యూనిలీవర్ ఆసక్తి**

**కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఓకే**




## సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

**గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపి అవతరణ**

**దావోస్ సదస్సులో చంద్రబాబు వివరణ**



**దావోస్:** సంప్రదాయేతర ఇంధన వనరులపై తమ ప్రభుత్వం అధిక దృష్టి సారించిందని, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా ఎపి మారబోతోందని అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది.

2లో

# 'దండకారణ్యం' నెత్తురోడింది

## ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్..

## 16 మంది మావోయిస్టులు మృతి

**మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి.. కీలక నేతలు ఉన్నట్టు ప్రచారం**

**సోమవారం ఉదయమే మొదలైన ఎన్‌కౌంటర్.. దశల వారీగా ఎదురుకాల్పులు**

**తొలిరోజున ఇద్దరు..రెండో రోజు 14 మంది మృతదేహాలు లభ్యం**

**ఇంకా కొనసాగుతున్న బలగాల కూంబింగ్**


**25 నుంచి 30 మంది వరకు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చనే అంచనాలు**

**కాంకేర్ ఎన్‌కౌంటర్ జరిగి వారం తిరగకముందే మరో ఎదురుదెబ్బ**

చర్ల/ మల్కన్‌గిరి: వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న మావోయిస్టులకు ఊహించని షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మృతి చెంది వారం తిరగకముందే.. ఛత్తీస్‌గఢ్%-% ఒడిశా సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కులారీఘాట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మరణించారు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు చలపతి కూడా ఉన్నట్టు గుర్తించారు.



2లో



## జన్మతః అమెరికా పౌరసత్వం ఇక రాదు

**ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా సంక్రమణ చట్టం రద్దు**

**బాధ్యతలు చేపట్టిన ట్రంప్ కీలక నిర్ణయం**

వాషింగ్టన్: అమెరికా గడ్డపై పుట్టినంత మాత్రాన ఇక అమెరికా పౌరులు కారు. వారి తల్లిదండ్రులు అమెరికన్లు అయితేనే వారు అమెరికన్లు అవుతారు. అక్కడికెళ్లి పిల్లలను

## పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

**ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం**


**ఇలాంటి వారుని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం**



## చిత్ర నిర్మాతల ఇళ్లపై ఐటి దాడులు

**దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్ ఇళ్లు కార్యాలయాల్లో సోదాలు**

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో మరోమారు ఐటి సోదాలు కలకలం రేపాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి



2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

**కమిషన్ ముందు హాజరైన ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు**

**రుణాలు, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపుపై ప్రశ్నలు**

# కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్,: కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ సుదీర్ఘంగా కొనసాగింది. సంక్రాంతి సెలవుల తర్వాత తిరిగి మంగళవారం నుంచి కమిషన్ విచారణను ప్రారంభించింది. దాదాపు గంటన్నర పాటు రామకృష్ణారావును కమిషన్ విచారించింది. దాదాపు 24 ప్రశ్నలను రామకృష్ణను కమిషన్ ఛైర్మన్ పిసి ఘోష్ అడిగారు. రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ఆయనను ముందు ప్రశ్నలు ఉంచారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, లోన్స్, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపు, వడ్డీల చెల్లింపులపై వంటి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్లు, బ్జడెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.కార్పొరేషన్‌కు నిధులు ఎలా వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. బడ్జెట్ కేటాయింపులు, లోన్స్ ద్వారా నిధులు సమకూర్చినట్లు రామకృష్ణారావు సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారన్న కమిషన్ ప్రశ్నకు.. పరిశ్రమలకు, ఇతర అవసరాలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేట్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని రామకృష్ణ చెప్పినట్లు సమాచారం.

## చిత్ర నిర్మాతల ఇళ్లపై ఐటి దాడులు

నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపున్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. 'ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం' అని ఆమె తెలిపారు. హైదరాబాద్ లో తెల్లవారుజాము నుండి ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 200 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు సమాచారం. ఇటీవల సంక్రాంతికి విడుదలైన రెండు స్టార్ హీరోల సినిమాలు నిర్మించిన సినీ నిర్మాత నివాసంతో పాటు, ఆఫీసు, కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రముఖ ఆ నిర్మాత సోదరుడు, కుమార్తె నివాసంలో కూడా ఐటీ సోదాలు చేస్తున్నారు. మరోవైపు గతేడాది చివర్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయి ఇండియా బిగ్గెస్ట్ హిట్ సాధించిన చిత్ర నిర్మాత ఆఫీసుల్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఆ చిత్ర నిర్మాణ సంస్థల్లో కీలకమైన ముగ్గురు ఇళ్లలోను ఐటి అధికారులు ఈ తెల్లవారు జామున నుండి సోదాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాణానికి చెందిన లావాదేవీలు, కలెక్షన్స్ తదితర వివరాలపై అరా తెస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఇద్దరి నిర్మాతలతో పాటు టాలీవుడ్ కు చెందిన ప్రముఖ మ్యూజిక్ లేబుల్ కంపెనీకి చేసిన అధినేత ఇంట్లో అలాగే ఆఫీసులో రైడ్స్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. సుమారు మూడు గంటల నుండి ఈ రైడ్స్ జరుగుతున్నట్టు సమాచారం.

## జన్మతః అమెరికా పౌరసత్వం ఇక రాదు

కనేయడం ద్వారా వారిని ఆ దేశ పౌరులను చేసే చట్టానికి ట్రంప్ చెల్లుచీటీ పలికారు. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం పిల్లలకు ఈ హక్కు సంక్రమించాల్సి ఉంటుంది. తాజాగా దీనిపై ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదు' అని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆయన ప్రభుత్వం వలస విధానంపై తీసుకొనే చర్యలకు ఇది చిహ్నమని నిపుణులు చెబుతున్నారు. ఈసందర్భంగా అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం అందిస్తోందని ట్రంప్ తప్పుగా వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 దేశాలు ఈ విధానంలోనే పౌరసత్వాన్ని అందజేస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం తర్వాత 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ శరణార్థుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఈ విధానం దాదాపు శతాబ్దకాలంగా అమలులో ఉంది. అక్రమ చొరబాటుదారులకు పుట్టిన పిల్లలకూ, టూరిస్టు లేదా స్టూడెంట్ వీసాపై వచ్చిన వారికి అమెరికాలో కాన్పు కాగా పుట్టిన పిల్లలకూ ఈ నియమం వర్తిస్తుంది. కాగా, ఈ విధానాన్ని రద్దు చేసే ప్రయత్నానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.

## గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోండి

ఈనెల 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ సభలు, వాటిలో నాలుగు పథకాలకు సంబంధించి ప్రజల స్పందన తదితర అంశాలపై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్ల వ్యయం అవుతుందని మంత్రులు వెల్లడించారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నందున ఈ రెండు పథకాలకు అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల్లో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారి జాబితాను గ్రామ సభల్లో వెల్లడించాలన్నారు.

# రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: మేఘా ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్‌తో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాల కల్పనకు సంబంధించి మూడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో జరుగుతున్న సమావేశాల్లో ఈ ఒప్పందాలు కుదిరాయి. రూ.11 వేల కోట్లతో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును తెలంగాణలో మేఘా సంస్థ ఏర్పాటు చేయనుంది. తద్వారా నిర్మాణ దశలో వేయి, నిర్వహణ దశలో 250 ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టులనూ ఈ సంస్థ స్థాపిస్తుంది. తద్వారా పునరుత్పాదక ఇంధనం, సుస్థిర అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానం చేరేందుకు తోడ్పడుతుంది. ఒప్పందంలో భాగంగా వ్యూహాత్మక ప్రదేశాల్లో రూ.3 వేల కోట్లతో వేయి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థను స్థాపిస్తుంది. తద్వారా వచ్చే రెండేళ్లలో ప్రత్యక్షంగా వేయి, పరోక్షంగా మూడు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసేలా వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూ.వేయికోట్లతో వెల్నెస్ రిసార్ట్‌ను మేఘా సంస్థ నెలకొల్పుతుంది. తద్వారా నిర్మాణ దశలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. మేఘాతో ఒప్పందాలపై మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తంచేశారు.

'స్కై రూట్' పెట్టుబడులు రూ.500 కోట్లు

హైదరాబాద్‌ను త్వరలోనే ప్రైవేటు రంగంలో అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో ప్రైవేటు రంగంలో రూ.500 కోట్లతో రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు స్కై రూట్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కంపెనీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఒప్పందం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ ఆధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందన్నారు. తెలంగాణకు చెందిన యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించడంతోపాటు, రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడాన్ని అభినందించారు. కంపెనీతో ఒప్పందం చేసుకోవడం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెబుతుందని సీఎం అన్నారు. తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్ లక్ష్యసాధనలో తాము భాగస్వామ్యం వహిస్తామని స్కై రూట్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన అన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా దిగ్గజ కంపెనీ యూనిలీవర్ సంస్థ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు బృందం చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంఓ ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలో వ్యాపారం, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన యూనీలీవర్ బృందానికి రేవంత్ వివరించారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, తమ ప్రభుత్వం అనుసరిస్తున్న సులభతర వాణిజ్య విధానాలు వ్యాపారాలకు అనువుగా ఉంటాయన్నారు. చర్చలు ఫలప్రదం కావడంతో తెలంగాణలో పెట్టుబడులకు యూనీలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

ఈ ఒప్పందంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్‌తోపాటు రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుతో ఇతర ప్రాంతాల నుంచి బాటిల్ క్యాప్‌ల దిగుమతి చేసుకుంటుండగా ఇకపై స్థానికంగా తయారవుతాయి. కాగా, కామారెడ్డిలో అవసరమైన భూమిని కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

వివిధ సంస్థలతో సంప్రదింపులు కాలిఫోర్నియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ హార్డ్‌వేర్, ఏఐ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో పేరొందిన 'సాంబనోవా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ'చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు బృందం చర్చించింది. తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వివరించింది.

# పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు.

# 'దండకారణ్యం' నెత్తురోడింది

(మొదటి పేజీ తరువాయి)

అయితే మృతుల సంఖ్య 25 నుంచి 30 వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి తర్వాత కూడా ఎదురుకాల్పులు, కూంబింగ్ కొనసాగుతూ ఉండటంతో బుధవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

దండకారణ్యంలోని కులారీఘాట్ అటవీ ప్రాంతంలో 60 మందికిపైగా మావోయిస్టులు సమావేశం అయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో బలగాలు రంగంలోకి దిగాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డిస్ట్రిక్ట్ ఫోర్స్, ఒడిశాకు చెందిన ఎస్ఓజీ (స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్) బలగాలు ఈ నెల 19 నుంచి సరిహద్దుల్లో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో 20వ తేదీన ఉదయం పోలీసు బలగాలు, మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలిరోజు ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందగా ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను రంగంలోకి దింపి.. సోమవారం మధ్యాహ్నం నుంచి కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. కొన్ని గంటల పాటు హెూరాహెూరీగా సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 14 మంది మృతి చెందారు. రెండు రోజుల్లో కలిపి మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 16కు పెరిగింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రా%-% ఒడిశా బోర్డర్ (ఏఓబీ) స్పెషల్ జోనల్ కమిటీ మిలిటరీ కమిషన్ చీఫ్ చలపతి అలియాస్ ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు పోలీసులు ప్రకటించారు. ఆయనతోపాటు మరికొందరు కీలక నేతలు కూడా మృతుల్లో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చలపతి మృతిపై స్పష్టత ఇచ్చిన పోలీసులు మిగతా వారి వివరాలను వెల్లడించలేదు. మృతుల సంఖ్య 25 %-% 30 మంది వరకు



పెరగవచ్చని భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన సుమారు 1,500 మంది పోలీసు బలగాలు కులారీఘాట్ అడవిని చుట్టుముట్టాయి. సుమారు 15%-%20 కిలోమీటర్ల సర్కిల్‌గా ఏర్పడి... కూంబింగ్ చేపడుతూ దగ్గరికి వచ్చాయి. సుమారు ఐదు కిలోమీటర్ల సర్కిల్‌లోకి రాగానే మావోయిస్టులు తారసపడినట్టు తెలిసింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి సెంట్రల్ కమిటీ సభ్యుడు కావడంతో ఆయనకు మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. ముందు వరుసలో సెంట్రీలు కాపలాగా ఉంటే చివరి వరుసలో ఫీల్డ్ పెట్రోలింగ్ టీమ్ రక్షణగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య బాంబులు అమర్చి ఉంటాయి. అయితే అగ్రనేతలు ఉన్నారనే పక్కా సమాచారంతోనే భద్రతా వలయాన్ని ఛేదించుకుని బలగాలు దాడి చేసినట్టు తెలిసింది. ఘటనాస్థలంలో ఇప్పటివరకు పది వరకు ఐఈడీలను గుర్తించి తొలగించినట్టు సమాచారం.

# సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని అన్నారు. 2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతు న్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటు లో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను.

## ఇన్స్టాగ్రామ్‌లో స్టోరీ పెట్టి యువకుడు అదృశ్యం

### చావు కోసం ఎదురు చూస్తున్నాం అంటూ పోస్ట్

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు..



**దీక్షిత, న్యూస్ డెస్క్:** కేపీ. హెచ్.బి కాలనీలోని వెంకటేశ్వర బాయ్స్ హాస్టల్ లో నివాసమంటూ చైతన్య అకాడమీ సెంటర్లో కోచింగ్ తీసుకుంటున్న చింతల పవన్ మణికంఠ(19) అనే యువకుడు సోషల్ మీడియా వేదికగా ఇంస్టాగ్రామ్ లో గుడ్ బాయ్ టు ఆల్, దేవుడి మళ్ళీ జన్మంటూ ఇస్తే ఇదే కుటుంబం, స్నేహితులతో జీవించాలని ఉందని కోరుకుంటున్నట్లు రాసుకొచ్చాడు. అదేవిధంగా తన చావు కోసం ఎదురుచూస్తున్నానని స్టోరీ పెట్టి అదృశ్యమయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హాస్టల్ వద్ద మణికంఠ కోసం వెతకగా అతను లేకపోవడంతో ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ రాగా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సొంత ఊరికి వెళ్లిన మణికంఠ 21వ తేదీన తిరిగి హైదరాబాదుకు రాగా వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి జేఎన్టీయూ కి చేరుకున్నానని టీ తాగి స్టడీ హాల్ కు వెళ్తానని తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్ది గంటల తర్వాత మరల తల్లిదండ్రులు కొడుకుకు ఫోన్ చేయగా నెంబర్ కలవకపోవడంతో హాస్టల్లో ఉండే తోటి మిత్రులకు కాల్ చేశారు. అతను హాస్టల్ వద్దకు రాలేదని ఇంస్టాగ్రామ్ లో మాత్రం స్టోరీ పోస్ట్ చేశాడని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీనితో మియాపూర్ మయూరి నగర్ లో నివాసం ఉంటున్న సమీప బంధువు అయిన రామయ్య తెలుపగా వెంటనే పోలీస్ స్టేషన్ లో తెలపడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరమ్మ సభలను సద్వినియోగం చేసుకోవాలి: జగదీశ్వర్ గౌడ్



### అర్హులకు తప్పనిసరిగా పథకాలను అమలు చేస్తాం..

**దీక్షిత, న్యూస్ డెస్క్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు సంబంధించి నిర్వహిస్తున్న ఇందిరమ్మ సభలను సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ కోరారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరమ్మ సభ కార్యక్రమంలో భాగంగా మాదాపూర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ వార్డు సభల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా తో పాటు ఇతర పథకాలను అందించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేయని వారు చేసుకోవాలని కోరారు. 75 గజాల స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగో విడతల్లో ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని గుర్తు చేశారు. మరోవైపు రేషన్ కార్డులు జారీ పైన కూడా కీలక ప్రకటన చేశారని జాబితాలో పేరు రానివారు ఆందోళన చెందవలసిన పనిలేదని ఈ వార్డు సభల్లో వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళు తుందని ప్రతి ఒక్కరిని గుర్తించే దిశగా అధికారులు సైతం ఇంటింటికి వచ్చి మరి సర్వే చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్,నాయకులు నాగేశ్వరరావు,కోటేశ్వరరావు,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముష్రాఫ్, రెహ్మాన్, రాజు, కిట్టు, నరేష్, ప్రభు, మోయిన్, శ్రీనివాస్ గౌడ్,అంజద్,ఖాజా,ముక్తార్,మణికప్ప,రాజేష్,శంకర్ మహిళలు శిశిరేఖ,అనిత, లక్ష్మీ,శ్రీజ రెడ్డి,ప్రేమ,సర్దార్ తదితరులు పాల్గొన్నారు..



## అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు చింత ప్రవీణ్

### అభినందించి అండగా ఉంటానని హామీ ఇచ్చిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, పట్వారి శశిధర్

### అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు

**దీక్షిత, న్యూస్ డెస్క్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ 124 డివిజన్ ఎల్లమ్మబండ గణేష్ నగర్ నివాసి చింత ప్రవీణ్ ఎంపికయ్యారు. ఢిల్లీ లో జరగబోయే కిక్ బాక్సింగ్ 57కిలోల విభాగంలో అంతర్జాతీయ పోటీలకి ఎంపిక ఐన విషయం తెలుసుకున్న ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ ప్రవీణ్ తో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ.వి.జగదీశ్వర్ గౌడ్ మర్యాధపుర్వకంగ కలిసారు. జగదీశ్వర్ గౌడ్ ప్రవీణ్ కి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రవీణ్ కి ఈ టోర్నమెంట్లో కావాల్సిని ఏ సహాయం ఐనా సరే తాను చేస్తాను అని హామీ ఇచ్చారు, ప్రభుత్వం ద్వారా కూడా తనకు కావాల్సిన సహాయం కూడా చేస్తాం అని హామీ ఇచ్చారు, అధే విధంగా పట్వారి శశిధర్ కూడ తనకు అండగా సహాయంగా ఉంటాను అని తెలియజేశారు. కార్యక్రమంలో జి.రవి,బొర్ర నాగేశ్వర్ రావు,మజర్,నాగన్న, మల్లయ్య,ప్రవీణ్,శివ చారి, టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు

## రసాభాసగా గ్రామసభలు





**దీక్షిత, మేడ్చల్:** ఇందిరమ్మ ఇళ్లు,రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు వంటి ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపికలో భాగంగా మున్సిపాలిటీల్లో, మండలంలోని గ్రామాల్లోని ఏర్పాటు చేసిన వార్డు,గ్రామ సభలు రసాభాసగా మారాయి. మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డు, మునీరాబాద్,గౌడవెల్లి, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్, రాయిలాపూర్‌లో వార్డు సభలతో పాటు మండలంలోని రావల్‌కోల్ ,సైదోనిగడ్డ తండా లో గ్రామసభలు నిర్వహించారు.

గుండ్లపోచంపల్లిలోని 4 వార్డు సభలో కౌన్సిలర్ అమరం సరస్వతి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధికారులు పాల్గొని సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో మండల,గ్రామ స్థాయి అధికారులు పాల్గొనగా గ్రామ,వార్డు సభల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను ప్రకటించారు. కాగా అధికారులు వెల్లడించిన జాబితాలో, ఆయా పథకాల్లో తమ పేర్లు లేవంటూ లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు, పథకాల జాబితాలో అర్హులైన లబ్దిదారుల పేర్లు రాలేవని, ఇళ్లు ఉన్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చాయంటూ అధికారులపై మండిపడ్డారు. అసలైన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదంటూ ఆందోళన చేయడంతో సభలు రసాభాసా గా మారాయి. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలుపడంతో ఆవేదన వ్యక్తపరుస్తూ తిరిగి దరఖాస్తు చేశారు.

### పేద ప్రజలకు ఒరిగిందేమి లేదు... బీజేపీ కౌన్సిలర్ అమరం సరస్వతి

ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నికల్లో నిలిచిన కాంగ్రెస్ ను ప్రజలు నమ్మి ఓట్లేసి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తుందని గుండ్లపోచంపల్లి బీజేపీ కౌన్సిలర్ అమరం సరస్వతి మండిపడ్డారు. వేల సంఖ్యలో లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటూ పదుల సంఖ్యలో మంజూరి చేస్తూ ప్రభుత్వం ఆర్పాటం చేయడం తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టకుండా అర్హులందరికి ప్రభుత్వ ఫలాలు అందించాలని కోరారు.

## ఎంపీ ఈటల ను కలిసిన బీజేపీ నాయకులు

**దీక్షిత,మేడ్చల్:** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకులు కలిశారు. మున్సిపల్ బీజేపీ నూతన అధ్యక్షులుగా కావేరి శ్రీధర్ ఎన్నిక కావడంతో పాటు నూతన కమిటీని నియమించడంతో పూడూర్‌లోని ఈటల నివాసంలో ఎంపీని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి,హంసరాణి, నాయకులు రవిందర్‌గౌడ్,కృష్ణ, సురేశ్,రాజు, విక్రమ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సరపరాకు అంతరాయం



**మేడ్చల్ (దీక్షిత):-** మేడ్చల్ మండలం రావల్ కోల్ గ్రామ పరిధిలోని 33/11కేవి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని మేడ్చల్ రూరల్ ఏఈ తెలిపారు. విద్యుత్ అంతరాయం కలుగు ప్రాంతాలు రావల్ కోల్ ఫీడర్, ఐడిఏ రావల్ కోల్ ఫీడార్, ఐడిఏ గణపతి ఫీడర్, రావల్ కోల్ అగ్రికల్చర్ ఫీడర్, చెరువు కుంట అగ్రికల్చర్ ఫీడర్, 33/11 కేవి ఆత్వెల్లీ ఫీడార్ ల విద్యుత్ అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ తెలిపారు.



# వార్డు అభివృద్ధి ధ్యేయంగా కృషి చేశాను కౌన్సిలర్ క్రిష్ణవేణి రవీందర్ రెడ్డి

**మేడ్చల్ (దీక్షిత):** మేడ్చల్ మున్సిపాలిటి పరిధిలోని 21వ వార్డు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందని కౌన్సిలర్ నారెడ్డి క్రిష్ణవేణి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రజా పాలనలో భాగంగా 21వ వార్డు లో ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో కౌన్సిలర్ నారెడ్డి క్రిష్ణవేణి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషిచేసినట్లు తెలిపారు. సిసిరోడ్లు, బిటి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ లు, కరెంట్ స్థంబాలు, త్రీఫేస్ వైర్లు వేయడం, చౌరస్తాలలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వార్డులోనీ సమస్యలకు పరిష్కారం చూపడంలో గొప్ప ఆనందాన్ని పొందగలిగానని, కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని అనేక ఒడుదొడకులను తట్టుకొని ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోవడం పూర్వజన్మ అదృష్టముగా బావిస్తున్నట్లు తెలిపారు. 21వ వార్డు ప్రజలు నాపై నమ్మకం ఉంచి కౌన్సిలర్ గా ఎన్నుకున్నందకు వార్డు ప్రజలకు జన్మ జన్మలు రుణపడి ఉంటానని కౌన్సిలర్ నారెడ్డి క్రిష్ణవేణి రవీందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయడం, రేషన్ కార్డులను అందివ్వడం, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అందిస్తున్నదని



కౌన్సిలర్ నారెడ్డి క్రిష్ణవేణి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ దీపిక నరసింహ రెడ్డి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డు ఆఫీసర్ శైలజ, నాయకులు శైలజా హారినాథ్, నరసింహ రెడ్డి, నారెడ్డి రవీందర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, పాండు గుప్త,.ప్రతాప్, కిరణ్, శైలెందర్, ఆర్.పి,స్వప్న, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలకు అసలైన అర్హులను పారదర్శకతతో ఎంపిక చేయాలి చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి

**మేడ్చల్ (దీక్షిత):-** ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామసభలు కార్యక్రమం కొనియాడదగినదని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహ రెడ్డి అన్నారు. నేడు మున్సిపల్ పరిదిలోని 2,వ 21 వార్డులలో స్థానిక కౌన్సిలర్లు రొయ్యపల్లి సరిత మల్లేష్ గౌడ్, నారెడ్డి కృష్ణవేణి రవీందర్ గౌడ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభలను మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సంధర్బంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పథకాలకు అసలైన అర్హులను పారాదర్శకతతో ఎంపిక చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామ సభలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు గ్రామ సభలలో ధరకాస్తులు స్వీకరించనున్నారని అన్నారు. కాబట్టి అర్హులందరు ఈ సంక్షేమ పథకాలకు ధరఖాస్తూ చేసుకోవాలని సూచించారు. గ్రామ సభలు ప్రతి వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ. విజయ లక్ష్మీ , టిపిఎస్ రాధకృష్ణ రెడ్డి, మేనేజర్ శ్రీదేవి, ఆర్ ఓ శ్రీమతి విజయలక్ష్మీ, శ్రీ హర్షద్ అహ్మెద్, పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నరసింహ రెడ్డి, నాయకులు మల్లేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్పీలకు డబ్బులు ఇవ్వొద్దు



**దీక్షిత,మేడ్చల్:** రుణాల మంజూరీలో సాయంగా నిలిచే ఆర్పీలకు ఏ మహిళా గ్రూప్ డబ్బులు ఇవ్వొద్దని, ఒకవేళ రుణాలు మంజూరీ చేయించేందుకు ఆర్పీలు డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని మేడ్చల్ మెప్మా అధికారి నరేశ్ తెలిపారు. మంగళవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ఇటీవల డ్వాక్రా సంఘాల రుణాల విషయంలో మోసాలకు పాల్పడిన సదరు ఆర్పీ లోలాక్షి ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. లోలాక్షి రుణాల అవకతవకల విషయంలో విచారణ జరుపుతున్నామని బాధిత మహిళా గ్రూప్‌లు నేరుగా ఫిర్యాదు చేయలేదని బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఆర్పీపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక నుండి డ్వాక్రా గ్రూప్‌లు రుణాల కోసం సదరు ఆర్పీని ఎవ్వరూ ఆశ్రయించవద్దని కోరారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాలు తమ గ్రూప్ లోన్ కోసం ఎవ్వరికి డబ్బులు ఇవ్వవద్దని అధికారులు ఎవ్వరూ డబ్బులు అడగరని స్పష్టం చేశారు. ఆర్పీలు రుణాల మంజూరీ సమయంలో డబ్బులు అడిగితే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన

# చైర్ పర్సన్ మర్రి దీపికా నరసింహారెడ్డి

**మేడ్చల్ (దీక్షిత):-** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గల 21 వ వార్డులో రూపాయలు 10 లక్షలతో నిర్మించనున్న నూతన సిసి రోడ్డు పనులను చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ నారెడ్డి కృష్ణవేణి రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. మాజీ శాసన సభ్యులు సుదీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ శాసన సభ నియోజక వర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ పట్టణ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. మౌలిక సధుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పట్టణంలో ప్రతి వార్డును అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. నూతన సిసి రోడ్లు, బిటి రోడ్ల



నిర్మాణాలతో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగు పరచామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి. నాగి రెడ్డి, పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నరసింహ రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, స్థానిక వార్డు ప్రజలు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

### నగర మేయర్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం

### ఎమ్మెల్యే తలసాని నివాసంలో కార్పోరేటర్ల భేటీ

### హాజరైన నగర బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,:** బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో నగర ఎమ్మెల్యేలు దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు



చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే.. జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. లా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. రోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వారి సంఖ్య19కి చేరింది.

Edited,Printed,Publihed & Owned by Printed and Published by Mahesh Etabonia & Sandeep Velluri, on behalf of Deekshitha Media Network,HNO-14-249/1/37 Sai Nagar Colony,Medcha (V) Medchal (M)Medchal Malkajgiri -501401Published At 14-249/1/37 Sai Nagar Colony,Medcha (V) Medchal (M)Medchal Malkajgiri -501401, Telangana State. Editor: Sandeep Velluri. Ph: +91 9908086026 , Ph: +91 8309983342 Source: https://www.epaperdeekshitha.com